# తిష్యరక్షిత

శ్రీ శివరాజు వేంకటసుబ్బారావు (బుచ్చిబాబు)

చరిత్రలో సంభవించని విషయాలలో సత్యం, వుందని నమ్మేవారికి - అంకితం ౧

ఈనాటికయందువచ్చు పాత్రలు:—

**అశోకుడు** — మహారాజు (బౌద్ధమతారాధకుడు)
**మహేంద్రుడు** — వరసకు అశోకుని తమ్ముడు
**విజ్ఞానమిత్రుడు** — సంఘమిత్ర భర్త
**సంఘమిత్ర** — మహేంద్రుని చెల్లెలు
**కరువకి** — అశోకుని రెండవ భార్య
**తిష్యరక్షిత** — ,, మూడవ భార్య
**శోభనామిత్ర** — పరిచారిక

(వీరుగాక పరిచారకులు, ధర్మయుక్తులు, చైనాయువకుడు మొదలగు మరికొందరు వత్తురు.)

స్థలం—పాటలీపుత్రం : రాజభవనం : విహారాలు. సమయం—క్రీ. పూ. ౨౩౭

## ఒకటవ అంకము

### మొదటి రంగము

(ప్రవేశం — కరువకి, శోభనామిత్ర. కరువకి వయస్సు, ౩౬. వనవిహారానంతరం స్నానంచేసివొస్తూ పూలమొక్కలు పరికిస్తూ, ప్రమద వనంలోకి ప్రవేశిస్తారు. చుట్టూగోడ; వొకమూల పెద్దగది. అందులోనుంచి నాట్యంచేస్తున్న ధ్వనులు, సన్నని గానం, వినిపిస్తుంటాయి. ఆకాశంలో లేతచంద్రుడు. ఏడుగంటలుకావొస్తుంది.)

కరువకి — ఏమిటే చప్పుడు?

శోభ — మన చిన్నరాణి నాట్యం సాధనచేస్తోంది.

కరువకి — ఎప్పుడూ అదేపనా? మొన్నరాత్రంతా, వొకటే నవ్వులు, వొకటే పాటలు. రాజుగారంటే బొత్తుగా భయంలేదు.

శోభ — కాని రాజంటే చాలాప్రేమని, నాతో చెప్పింది. అందుకనే ఆయన్ని సంతోషపెట్టడానికి యివన్నీ ప్రయత్నాలు.

కరువకి — పాపం, ఆయన ఏకాంతాన్ని భంగం చేస్తోంది.

శోభ — ఆయన్ని యెప్పుడూ తనదగ్గరే వుంచుకోవాలని...

---

౧. ఈ నాటికలో జరిగిన ముఖ్య విషయాలకు, చరిత్రలో ఆధారా లున్నాయి: కాని, నే నేవి కల్పించానో తెలుసుకోవా లన్నవారు, విన్సెంట్ స్మిత్ వ్రాసిన, 'అశోక' చూడొచ్చు. భండార్కర్, ఎడోల్ఫ్ వేలీలుకూడా, నా ఆధారాలే.

౨. ఈ నాటిక వ్రాయడంలో నా వుద్దేశం, యేదైనా, బౌద్ధమతాన్ని విరుద్ధంగా విమర్శించడం మట్టుకు కాదు. ఎంతవరకూ అసలు మతాన్నే విమర్శించానో, నాటకం చదివినవాళ్లకంటె, ఆడగా చూసినవాళ్లకు తెలుస్తుం దనుకుంటాను.

కరువకి — తప్పు, మెల్లగా చెప్పు. ఆయన యీ బాధపడలేకే, నెలకు రెండుసార్లయినా గయకు వెళ్లి, బోధివృక్షాన్ని పూజిస్తూ వుంటారు.

శోభ — ఐతే ఆవృక్షానికి ఆయువు మూడిం దన్నమాటే.

కరువకి — ఆ, ఏడిసింది, పిచ్చిది...

(నవ్వుకుంటూ నిష్క్రమిస్తారు.)

## రెండవ రంగము

(నాట్యం ఆపుచేసి, తిష్యరక్షిత వనంలోకి ప్రవేశిస్తుంది. అటూ యిటూ చూస్తూ చప్పట్లు కొడుతుంది. ప్రవేశించిన పరిచారికతో చెవులో యేదో చెబుతుంది. తిష్యరక్షిత, పచ్చటిచాయ, వంకర తిరిగిన నడుం; పెద్దకళ్లు, నుదురు, ముక్కు; పల్చటి పెదవులు, వెన్నెలలో కనిపించని చిన్నినోరు. వయస్సు, 23. దట్టంగా అల్లుకున్న లతవెనకాల దాగి వుంటుంది. మహేంద్రుడు పెద్ద రాగికూజాతో మొక్కలకు నీళ్లు చల్లుతూ, మంత్రం మెల్లగా పఠిస్తూ, లతను సమీపిస్తాడు. శిఖరంగా మెలిపెట్టిన వెంద్రుకలు, పెద్దకుండలాలు— అతని వయస్సు, 30. కిలకిలనవ్వుతూ బైటపడుతుంది తిష్యరక్షిత.)

తిష్య — అబ్బ మీద జల్లావు నీళ్లు. ఆమాత్రం చూసుకోవొద్దు. పొదల్లో అనేకజంతువులు, కీటకాలు దాగివుంటాయని? భక్తుడైనంతమాత్రాన, యితరప్రాణికోటిని నిరాదరించవచ్చా ... ఆ! అమ్మా!...ఊరికే పరిహాసానికన్నాను. అదిల్లాతే, నే చల్లుతా నీళ్లు. భక్తితో నీహస్తాలు వొణికిపోతున్నాయి...తే, యిల్లా.

మహే — ఇక్కడిల్లా యెందు కున్నావ్ నువ్వు? వొదులు—పట్టుకోకు, — నీళ్లుపొయ్యడం నాకు నియమం.

తిష్య — నేనా? నేను నీకోసమే; నిన్ను చూడాలని. నీకళ్లల్లో గొప్ప తేజస్సు వుంది. దాన్లో నా హృదయాన్ని నశింపచెయ్యడం కోసమే, యీపాడుపోయిన దేవాలయంలో బంధింపబడి వున్నాను. ఇక్కడన్నీ శిలావిగ్రహాలే — వొక్కరికీ, నాట్యం, సంగీతం, సౌందర్యం అర్థంకావు. నోరు మెదల్చి మాట్లాడేవాడవు నువ్వు వొక్కడవే నాకు. నువ్వుకూడా శిలగా మారిపోకు...నన్ను పొయ్యనీ నీళ్లు.

మహే — తప్పు తప్పు. ఇల్లాంటిమాటలు నీకు తగవు; నీవు మహారాణీవి. నువ్వు చిన్నతనం మానాలి.

తిష్య — చిన్నతనంలో వున్నదాన్ని, చిన్నతనం యెల్లా మానను? నీచిన్నతనంలో నువ్వూ? ఐదేండ్లక్రితం నువ్వు నాకోసం పడిన మనోవ్యథ? నేను తప్ప, వేరే మతం లేదన్నావే!

మహే — కావొచ్చు, అదంతా అజ్ఞానం. ఇప్పుడు, నాకు బుద్ధుడు తప్ప వేరే దైవం లేదు. నువ్వు, నామీద వున్న ప్రేమను, బుద్ధుడి మీదికి మార్చుకో. చూడు, గతించిన నీఅక్క ఆసంధిమిత్ర భర్తకు సహాయపడి, బౌద్ధమతప్రచారానికి అన్నివిధాలా తోడ్పడి, నిర్వాణం పొందింది...

తిష్య — ఆ, మన్ను: నిర్వాణం కాదు, చచ్చింది. కాని, ఆమెను గౌరవిస్తాను. ఎందుకంటే శరీరాన్ని మరిచిపోయి హింసించుకోలేదు. అశోకుడి యవ్వనంలోని వెన్నెలంతా, ఆమే పొందింది.

మహే — మధ్యలో అడ్డంరాకు. అల్లా సహాయపడి, చరిత్రలో అమరత గణించుకుంది. నువ్వు ఆమెను ఆదర్శంగా యెంచుకొని అమరత పొందాలి.

తిష్య — అవుతే, మన బ్రతుకు చరిత్రలో అమరత పొందేటందుకా. నిర్వాణం, మనకోసం కాక, చరిత్రకారులకోసమన్నమాట. పోనీ నిజంగా మనం మంచివాళ్లమైనా, చరిత్రకారులు సత్యం రాస్తారని నిర్ధారణెక్కడుంది. వాళ్లూ మనలాగు మనుషులేగా.

(మహేంద్రుడు, మౌనందాలుస్తాడు)

తిష్య — ఆ, అల్లా రా దోవలోకి. నువ్వు శిలగా మారేముందు, పూర్తిగా మనిషివో కావో చూసుకో. ఏదీ నీహస్తం యిల్లా తే. ఏది, వెచ్చగా తగుల్తోందా? నన్ను కౌగలించుకుంటే స్పర్శ వుందా? ఏవీ, ఆ అధరాల కదలికలో ప్రాణం వుందా...

మహే — ఛఛ...అబ్బ, వొదులు, మహాపాపం, అశోకుడు నా సోదరుడని గుర్తించు.

తిష్య — ఇద్దరూ వొకలాగే వున్నారు.

మహే — ఛఛా. ఘోరం. నువ్వుచీకటిలో వున్నావు.

తిష్య — అవును, నీముఖంలోని వెలుగు నాకు చూపించు.

మహే — నీభర్త అశోకుడు, మహారాజు; అతనికీర్తి చంద్రికలు భరతఖండం అంతా ప్రసరించాయి. అతని ముద్దులభార్య నువ్వు.

తిష్య — అబ్బ...'ముద్దు' ఎంతచక్కగా వుచ్చరించావు. ఆమాటలో అంతమాధుర్యం వున్నప్పుడు, ఆవొస్తువులో...ఏం?

మహే — అశోకుడు, రాజాధిరాజు.

తిష్య — నన్నుతాకే పాపం, ఆయనకే తగలనీ, నా కెందుకనా, నీయెత్తు? స్వార్థంలో, అశోకుడు, నీకు తీసిపోడు. అతడు నన్నుతాకడు. నన్నుచూసి సంతోషంతో నవ్వడు. నాకతన్ని చూస్తే భయం. అతను రాతివిగ్రహం...మరి, నన్ను ఎందుకు వివాహం చేసుకున్నాడు?

మహే — రాజుకు రాజ్యసంప్రదాయాల ననుసరించి కొందరు భార్యలు అవసరం. నీవల్ల రాజ్యం పెరిగి౦ది. అతనికి, భార్యలకు, అర్పించేందుకు, ప్రత్యేకమైన హృదయాలుండవు.

తిష్య — రాజ్యవిస్తీర్ణత కోసం భార్యలూ, కీర్తి కోసం మతమూ—ఇదా మీనీతి?

మహే — రాజు, ప్రజలకు ఆదర్శంగా వుండేందుకు,తన ప్రత్యేకవాంఛలను త్యాగం చెయ్యాలి. అతనికి, దేశం తప్ప వేరు లోకం లేదు.

తిష్య — పోనీ ప్రజలకేనా, ప్రత్యేకత వుందికదా!

మహే — కాదు నువ్వు రాణీవి.

తిష్య — చాలించు నీ నిర్వాణం, నువ్వు శిలవు.

మహే — మతంకోసం శిలగా మారినా దోషం లేదు. ప్రేమపేరు చెప్పి జంతువులుగా మారడంకంటె యిది చాలా నయం.

తిష్య — నాకు కోపం తెప్పించకు. నాకు కావలసిన వొస్తువు అర్పిస్తే లోకానికెంతయినా త్యాగం చేస్తాను. నా ప్రేమను నిరాదరించకు. అది నిష్కల్మషం, నాజన్మశక్తి. నాలుగేండ్లక్రితం నువ్వు ప్రేమయాత్ర ముగించావు నాబోటి మార్గస్థులను యెందర్నో కలుసుకున్నావు. అశోకమహారాజు, చాలాకాలం ప్రేమను ఆరాధించాడు. తను ఆరాధించిన స్త్రీలకు, సాంచి, సారనాథ్ స్తూపాలద్వారా అమరత గణించి పెట్టాడు. నేప్రవేశించేప్పడికి బౌద్ధ సన్యాసిగా మారిపోయాడు. అది నా దౌర్భాగ్యం. (కన్నీరు కారుస్తుంది.)

మహే — వొద్దు ఏడవకు. నీకన్నీరు చూస్తే నా మనస్సు చలిస్తుంది. నన్ను సాధారణ మానవునిగా మార్చకు.

తిష్య — మాతండ్రి నే రాణీ అవుతాననీ, తనకు పెద్దపదవి వొస్తుందనీ యోచించి నన్ను యీదేవాలయంలో ఆరాధించ మన్నాడు. కాని పూర్తిగా నేను నాతండ్రిని దూషించను. నేను అశోకుని గౌరవించాను. అతని కండ్లలో శాంతి కనిపించింది; అతని పలుకులో కరుణ వినిపిస్తుంది. కాని అతని హృదయం నాకు దూరమైంది. మతాలను ఆదరించిన చరిత్రకారులు, అతన్ని పొగడినా, శరీరానికి ప్రాధాన్యత నిచ్చిన గ్రంథకర్తలు నన్ను స్తుతించకమానరు. అశోకునికి, తనను ప్రేమించిన వ్యక్తే శాశ్వతమైన శత్రువుకాగలదు. మహేంద్ర! యీమతంపేరు చెప్పి, నీ జీవితశోభను మరుగుపరుస్తున్నావు. మానవుడుగా వుండటంకంటె వేరే మతంలేదు.

మహే — కావొచ్చు కాని, మానవుడుగా వుండటం అంటే వాంఛ కాదు.

తిష్య — అది వొప్పను. అల్లా అన్నవాళ్లందరూ తమను తాము మోసగించుకుంటున్నారు. మానవత్వానికి, వాంఛ మొదటిమెట్టు. అది ప్రధానమైంది. తరువాతవి, అసహజమైనా, మానవ ఔన్నత్యాన్ని సాటిస్తాయి. సముద్రగుప్తుడి! అల్లా జరగలేదా?

మహే — తిష్యా, నీయింతటివిజ్ఞానం, ఆశ్చర్యం కలగచేస్తోంది. దీన్ని సరైన తోవలో పెడితే లోకాన్ని వుద్ధరిస్తావు.

తిష్య — నిజమైన వాంఛను వాక్కంటే, అదే విజ్ఞానంగా కనిపిస్తుంది. ఈ సత్యాన్ని బౌద్ధ మతంలో చూడగలిగావా?

మహే — ఈ విషయానికి సమాధానం, అశోకుడు చెప్పగలడు. రాత్రి బహుశః పదిగంటలకు బోధి వృక్షపూజను సమాప్తి చేసి గయనుండి వొస్తాడని తెలిసింది. కాని,...కాని...

తిష్య — ఆ, ఏమిటి.

మహే — వొద్దు, వొద్దు...ఏమీ లేదు.

(చేత్తో ఏదో సంజ్ఞ చేస్తాడు)

తిష్య — చెప్పు... సత్యాన్ని మతంకోసం, నశింప చెయ్యకు...నేను...

(మహేంద్రుడు, తొందరగా నిష్క్రమిస్తాడు.)

(తెర)

## మూడవ రంగం

(ఆ రాత్రే ౯ గంటలకు పెద్దగది, పెద్దబుద్ధుని రాతివిగ్రహంముందు సంఘమిత్ర నాట్యం చేస్తూ వుంటుంది. వయస్సు, ౨౬. ఆమెభర్త విజ్ఞానమిత్రుడు, వెండిగొలుసుల ఉయ్యాలమీద వూగుతూ చూస్తూ వుంటాడు. విజ్ఞానమిత్రుడు ఆజానుబాహుడు; చిన్నకళ్లైనా తీర్చినట్టుగా వుంటాయి. సంఘమిత్ర, మితభాషి; కిందిభాగంలావు. పాటలేకుండే వృత్తనాట్యమే చేస్తోంది. దంతపువిసనకర్రకాడతో భర్త ఉయ్యాలపైని మద్దెలగా వాయిస్తున్నాడు. ఈ భవనంలోకి ప్రవేశించి చూస్తూ నిలబడుతుంది తిష్యరక్షిత.)

తిష్య — (చప్పట్లుకొట్టి) బాగుంది...ఈ శృంగారం బుద్ధుడికోసమా, భర్తకోసమా?

సంఘ — మహారాణీకి నమస్కారం.

తిష్య — ఎవరికోసం యీ నాట్యం?

సంఘ — లోకాన్ని మరిచిపోవడంకోసం.

తిష్య — లోకం యేంచేసింది?

సంఘ — లోకం అంతా మాయ, అసత్యం, క్రూరం, బాధ, నీచం...

తిష్య — బుద్ధుడు లోకంలోనివాడేగా. నీభర్త కూడా యీ జాతికే చెందుతాడా.

సంఘ — మనం అంతా యీ లోకంలోనివాళ్లమే— అందరం యిందులోంచి శీఘ్రంగా తప్పించుకోడానికి ప్రయత్నించాలి.

తిష్య — బుద్ధుడు హృదయంలేనివాడు; వున్నవాడైతే యీపాటికి నీ నాట్యానికి యీ బొమ్మ లేచి మాట్లాడును.

సంఘ — మన మీలోకంలోనుంచి యెంత తొందరగా వెడితే, అంత తక్కువ జీవహింస చేస్తాము.

తిష్య — మనను యెంతో ప్రేమతో పుట్టించిన యీలోకనికి శత్రువులుగా కావాలంటావు! బాగుంది. కాని, 'మనం,' 'మనం' అంటున్నావు నన్నుమాత్రం చేర్చకు.

సంఘ — నన్ను క్షమించాలి.

తిష్య — (విజ్ఞానమిత్రునితో) నీ శత్రువు నాట్యం చేస్తుంటే చూసి ఆనందిస్తున్నావన్నమాట?

విజ్ఞాన — లేదు పాపం, నేను చెయ్యమంటేనే చేస్తోంది. ఊరకే యిల్లా వుపన్యాసాలిచ్చినా, సమయం వొచ్చేప్పటికి నామాట జవదాటదు.

సంఘ — అసత్యం మాట్లాడకండి. నే చేసేప్రతికార్యం బుద్ధునికోసమే; ఈనాట్యం, నా తన్మయత్వం కొరకు.

తిష్య — తన్మయత, అర్ధరాత్రికి కాని పూర్తికాదను కుంటాను.

విజ్ఞాన — అవును రాణీ! (నవ్వుతాడు)

తిష్య — అర్ధరాత్రికి బుద్ధుడికి ప్రాణం వొస్తుందన్న మాట. అప్పుడాయనలో ఐక్యం అవుతావు. అంతవరకు నీభర్త...

సంఘ — రాణీ, మహాపురుషుని నిందిస్తున్నారు. నన్ను క్షమిస్తే, నేను శెలవుతీసుకుంటా.

తిష్య — వొద్దు. నువ్వు వుండాలి. నాకు నాట్యం అంటే చాలప్రీతి. హృదయం వున్నవాళ్లకు, దాని లయలోవున్న తన్మయత బోధపడుతుంది. నీ నాట్యానికి యీ బొమ్మ లేచి మాట్లాడును.

సంఘ — రాణీ! అల్లా అనడం వంచింపు.

తిష్య — లేక నీ నృత్యం స్వార్థంకోసమేమో.

సంఘ — నన్ను క్షమించాలి. (నిష్క్రమిస్తుంది)

తిష్య — చూశావా, నీ భార్య నన్ను తిరస్కరించింది. నామమాత్రమే నీభార్య. అసలు ఆమె బుద్ధునిభార్య. ఇట్లాంటి అవినీతికర మైనవాళ్లు నృత్యంచేస్తే, బుద్ధుడు సంతసించడు. అందుకనే యీవిగ్రహం చలించదు. నేనే కనక నాట్యం చేస్తే యిది చలించగలదు.

విజ్ఞాన — (ఆశ్చర్యంతో) నిజంగానా!
(తిష్యరక్షిత నృత్యం చేస్తుంది; కాని విగ్రహం చలించదు. విజ్ఞానమిత్రుడు, తన్మయత చెంది, చప్పట్లు కొడతాడు.)

విజ్ఞాన — ఆహా—అశోకుడికి తగిన భార్యవు. నా సంతోషం చెప్పలేను. బుద్ధుడు ధన్యుడు.

తిష్య — ఈ విగ్రహం యెందుకు చలించలేదో తెలుసా? బుద్ధుడికి నామీద ప్రేమ లేదు. అతడు నన్ను చూసివుంటే ప్రేమించివుండును. ప్రేమించినవొస్తువుకు శిలైనా ప్రాణం వుంటుంది. చూడు, నీకు నామీద ప్రేమవుంది కాబట్టే చలించి తన్మయత చెందావు. అవునా?

విజ్ఞాన —(ఆశ్చర్యపడి కళ్లు పెద్దవి చేసి.) నీతర్కం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. మన కల యిక అసంభవం, యీజన్మలో

తిష్య — ఎందుచేత?

విజ్ఞాన — మతం, నీతి, సంప్రదాయం, సంఘకట్టుబాట్లు — యివి మనకు అంతరాయాలు.

తిష్య — ఇవన్నీ మానవనిర్మితా లని వొప్పుకుంటావా? సౌకర్యంకోసం, శాంతికోసం, వీటిని మానవుడు నిర్మించాడు. ఇవి, వాటిని యివ్వలేకపోతే, వీటిని నిర్మూలం చెయ్యాలని నమ్మతావా? విశ్వాసం, అనేకమందిని వికసించనియ్యకుండా చేస్తోంది. దీనినుండి విముక్తుడయ్యాడు కాబట్టే, సముద్రగుప్తుడు, ఆగోడ మీద చిత్రాన్ని వ్రాయగలిగాడు.

విజ్ఞాన — మతం మానవకల్పితమైనా, దానికి లోబడి వుండటం నీతి. బుద్ధుని మతం మంచిది కాకపోతే, యిన్నివేలమంది దాన్ని అవలంబించి వుండరు.

తిష్య — మతం మంచిదే, కాని అది మానవశక్తిని నిర్మూలం చెయ్యకూడదు. ఈ విగ్రహం యెన్నిప్రాణాలను బలికోరిందో... దీనికేం... నన్ను ప్రేమించవు?

విజ్ఞాన — ప్రేమిస్తా. కాని, భయం.

తిష్య — పిచ్చివాడవు. లోతులేని సముద్రంలో ఒక కెరటంపై నురుగువు నువ్వు ... నిన్ను ఆరాధించడం, నావ్యక్తిత్వాన్ని నాశనంచేసుకోడం.
(అంటూ నిష్క్రమిస్తుంది)

## నాలుగవ రంగము

(ఆరాత్రే; పదకొండు కావొస్తుంది. అశోకుడు పీఠంమీద కూర్చుని, నిమీలిత నేత్రాలతో ఆలోచనలో పడ్డాడు. ఎదురు గుండా పెద్ద, బుద్ధునిశిలావిగ్రహంవుంది. ఆగదినిండా, అనేకలోహపువిగ్రహాలు, వింతవింత పరిణామాలతో, అమర్చబడి వుంటాయి. అశోకునివయస్సు, ౪౪; విశాలమైన వక్షస్థలం, గుండ్రని

ఒరువైన బుజాలు, పొట్టిమెడ, పొడవైనముక్కు, కిందిపెదవి పెద్దది, కళ్లు, యెప్పుడోకాని చిట్లించడు బుద్ధుడివిగ్రహాన్నీ అతన్నీ పోల్చడంకష్టం. తిష్య రక్షిత, చప్పుడు కాకుండా లోనికి ప్రవేశిస్తుంది. తలనిండా పుష్పాలు; జబ్బలకుపూలదండలు, చెవులకు మందారాలు. పాపిడికి యెడమవైపున, పావురపుయీక. కండ్లలోని తడి, ఆముదపు మెరుగులో మసగతో మెరుస్తుంది. నేత్రాలలో సృష్టికర్తకు సంబంధించిన, కడసారివెలుగు చెలరేగింది. వెనక కూర్చుని, అశోకు నేత్రాలు మూస్తుంది. కొంతవడి, నిశ్శబ్దం.)

అశో — తిష్యా!

తిష్య — (మాట్లాడదు).

అశో — ఈచిన్ని చేతులు తిష్యవే...ఇంకా పడుకో లేదేం పొద్దు పోలేదు? వొనులమ్మా...

తిష్య — (చేతులు తొలగించి, అతని కంఠంచుట్టూ వేస్తుంది)

అశో — నేప్రార్థనలో వుండగా యిల్లా చెయ్యొచ్చా?

తిష్య — అబ్బ! యెప్పుడూ ప్రార్థనేనా? ఇప్పుడేగా చెట్లనూ చేమలనూ పూజించి వొచ్చారు. నేను మీకోసం, యెంతో ఆతృతతో నిరీక్షిస్తున్నాను. చూడండి, అచంద్రుడు...ఈ ఆముదపుదీపంలో యెన్నో పురుగులు నశిస్తున్నాయి. ఇట్లాంటి జీవహింస చెయ్యొచ్చునా?

అశో — (నవ్వుతాడు) పాపం చిన్నతనం...బాలికలా పలుకుతుంటే, జాలిగా వుంది. ఆ పురుగులంత సున్నితంగా వున్నావు. ప్రకృతిలో నశించేవాటికి మనం బాధ్యులం కాము. వెళ్లి పడుకో. మాచిట్టిని కావు.

తిష్య — మీ రొస్తేకాని నే వెళ్లను అబ్బ!

అశో — తప్పు. ఈ మహనీయుడు చూస్తుండగానే నువ్విల్లాంటి పన్లు చెయ్యడం? (అని బొమ్మకేసి చూపుతాడు)

తిష్య — పోనీ గుడ్డివానిగా చెయ్యనా? (ఆముదంలో వేళ్లు ముంచి బుద్ధుడినేత్రాలకు గుచ్చుతుంది.)

అశో — ఆ, తప్పు, మరీ పెంకిపిల్ల వవుతున్నావు. ఇంక పో నువ్వు.

(బంట్రోతు పిలుస్తాడు)

అశో — చూడు, ఎవరో వొచ్చినట్లున్నారు.

తిష్య — (మెట్లుదిగి) ఎవరది?

బం — విద్యానందస్వామి, రాజుగారి దర్శనానికొచ్చారు.

తిష్య — ఇప్పుడు యెవ్వరికీ రాజుగారు, దర్శనం యివ్వరు.

(బంట్రోతు, నిష్క్రమణ)

అశో — ఎవరది?

తిష్య — బంట్రోతు పక్క సిద్ధమైందని చెప్పడానికొచ్చాడు. నేనే లెండి, పన్నీరు జల్లి సిద్ధం చెయ్యమన్నాను.

అశో — ఇవాళ నేను ఏకాంతంగా పడుకోవాలి; నేను వొక నూతన సంకల్పం తలపెట్టాను

తిష్య — మీ రెప్పుడు ఏకాంతంగా లేరో సెలవియ్యండి. అక్క అదృష్టవంతురాలు. మీరీ మతపిచ్చిలోపడి అన్నీ మరిచిపొయ్యేప్పటికి, అది గతించింది. నాదీ కర్మం, ఈమతంలోని మజా నాకింతవరకు బోధపడలేదు.

అశో — అల్లా నువ్వు మతాన్ని దూషించకూడదు. ఈ విషయాలు సొంతంగా అనుభవించవలసినవేకాని, చెపితే బోధపడవు. నీ అక్క అల్లా అనుభవించి నిర్యాణం పొందింది.

తిష్య — నిర్యాణం, నిర్యాణం అంటారు అందరూ. అదేమిటో చూపుదురూ.

అశో — చెప్పాగా! నీ కర్థం కాదనీ—

తిష్య — అందరికీ అర్థంకాని ఈ మతం యెందుకు?

అశో — కష్టపడితేనే కాని, దాన్ని గ్రహించలేవు.

తిష్య — కష్టమంటే ప్రేమా, హృదయం లేకపోవడమన్నమాట. ప్రేమలేని యీమతంకంటే మతం లేని జంతుజాలం ఉత్తమం కాదా అని నా సంశయం.

అశో — నీ వన్నీ భావాలు. బుర్రలో భావాలు. తార్కికశక్తి వున్నంతమాత్రాన, విజ్ఞానం లభించదు. నీభావాలకు ముందుకు నడిచే శక్తి లేదు. అన్నీ నీలోనుంచే వుద్భవించి, నీలోకే చేరుకుంటాయి.

తిష్య — అర్థంలేని మూఢనమ్మకంతో సత్యాన్ని సాధించడంకంటె, తర్కంతో అసత్యాన్ని సాధించడం ఘనం కాదా?

అశో — అదుగో, అదే 'భావం' అంటే.

తిష్య — ఏదో నిదర్శనంలేని భావాలు యెందుకు పూరికే ఉద్భవిస్తాయి. 'అశోకుడు నాభర్త' అన్నది భావం కాదు. కాని, 'అశోకుని నే ప్రేమించితిని' అన్నదికూడా భావం కాదు. కాని 'నన్ను అశోకుడు ప్రేమించుచున్నాడు' అన్నది భావం. సత్యం కానిదే యీ భావం యెందుకు జనిస్తుంది చెప్పండి. పైరెండు నాకు సంబంధించినవి కాబట్టి, అవి భ్రమలు కాని మూడవది యథార్థం. ఈ భావమే పిచ్చిదైతే మీకు ప్రేమ లేదన్నమాట. ఔనా?

అశో — కాదు, నాకు ప్రేముంది.

తిష్య — మరెందుకు నన్ను నిరాదరించటం? దాన్ని ఋజువుచెయ్యంకే, సత్యంలో నా కెల్లా నమ్మిక కల్గుతుంది?

అశో — ప్రేమకు ఆకారం లేదు. ఋజువు ఐన వెంటనే అది నశిస్తుంది.

తిష్య — అవుతే మీరు బుద్ధుని ప్రేమిస్తారా?

అశో — ఆ.

తిష్య — అవుతే, యీ గదినిండా, యీవిగ్రహాలెందుకు?

అశో — మనోనిశ్చలత్వానికి.

తిష్య — అల్లాగే నన్నూ యెందుకు చూసుకోరు.?

అశో — నువ్వు మనస్సుకూ, శరీరానికీ యెడబాటు కలిగిస్తావు.

తిష్య — దేనివల్ల?

అశో — నీ శరీరపు వునికివల్ల.

తిష్య — అవుతే నన్ను చావమంటారన్నమాట. నా సౌందర్యం, నే చేసిన అపరాధం అన్నమాట. సరే లెండి పోయి చస్తాను.

(వెళ్లబోతూ, వొక బుద్ధవిగ్రహాన్ని తన్నగా అది ముక్క లవుతుంది)

తిష్య — క్షమించండి, చూళ్లేదు.

అశో — నువ్వు నామీద కోపగించకూడదు. నా యవ్వనం గతించింది; దేశానికి ఆదర్శ పురుషుణ్ణి కావాలి, నా శరీరం అలిసిపోయింది, సంసారాన్ని విసర్జించాలి; ఇందుకు మీరంతా తోడ్పడాలి నేను ముసిలి ఆరాధకుడనయ్యాను.

తిష్య — అంతవోపిక లేనివారు నెల కన్నిసార్లు గయదాకా వెళ్లి, ఆ చెట్టు నెందుకు పూజిస్తున్నారు?

అశో — అది నా ఆదర్శాని కొక బహిర్గత నిదర్శనం. దానికి మృత్యువు లేదు. కొన్ని యుగాలు నా కీర్తిని, పొరపాటు మనకీర్తిని సాటిస్తుంది.

తిష్య — ఎందుకు లెండి తప్పులు దిద్దుకోటం. గాలివానకు, అది విరిగిపడిపోతే? ప్రకృతిది మీ మతాల శక్తికంటె మించిన శక్తి. అది తల్చుకుంటే, బౌద్ధమతం, భరతఖండంలో లేకుండా రూపుమాపకలదు. చూడండి, ఆగాలి, ఆహా యేమి చల్లదనం? చూడండి, యీ పురుగుల కల్లోలం, ఆవెలుగు అల్లరి చూడండి, అచంద్రుని పరుగు, వొగర్పు...నాకు శెలవు...ఆ విగ్రహాన్ని గాలికి యెగిరిపోకుండా, కాగలించుకుని పడుకోండి.

(నిష్క్రమణ-గాలికి దీపం ఆరుతుంది.)

## రెండవ అంకము

### మొదటి రంగము

(తిష్యరక్షిత రహస్యమందిరం. గదినిండా పగిలిపోయిన బుద్ధునివిగ్రహాలు పడివుంటాయి. కళ్లుమాత్రం చిత్రించబడిన పటాలు చిందరవందరగా అమర్చబడ్డాయి. చిన్న కత్తితో రెండు కొమ్మలను ముక్కలు

ముక్కలుగా కొడుతూవుంటుంది. పైభాగం అంతా వివస్త్ర ఐ వుంటుంది. గూట్లోనుంచి చల్లటిగాలి-మధ్య మధ్య అందులోనుంచి యెగిరిపొయ్యే ఆకులను పట్టుకోడానికి కిటికీవద్దకు వస్తూ వుంటుంది. (ప్రవేశం శోభనామిత్ర.)

శోభ — మహారాజు చాలా కోపంగా వున్నారు. ఎందుకమ్మా ?

తిష్య — శక్తిలేనికోపం; సన్యాసికోపం. ఆకలిగా వున్నా, పైకి చెప్పకోడానికి ఉపాసం వున్న వాడికి యెల్లావుంటుంది ?

శోభ — ఏమో చాలా బిగ్గరగా మాట్లాడుతున్నారు. అందర్నీ పిల్చి యేదో చెట్టునుగురించి ప్రశ్నిస్తున్నారు.

తిష్య — నిజంగానా అవుతే తెలిసిందన్నమాటే· నువ్వు యెవళ్లతోనూ చెప్పకూడదుసుమా. నా ప్రాణసమానం, యీరహస్యం. గయలో వున్న బోధివృక్షాన్ని, నాశనం చెయ్యాలని, నేనే పన్నాగం పన్నాను. పూర్తిగా సఫలం కాలేదు నా కార్యం. ఇదిగో ఆచెట్టుతాలూకు రెండు కొమ్మలు. వీటిని పూజించటానికే ఆయన యెప్పుడూ వెడుతూ వుంటారు.

శోభ — ఎందుకల్లా? వీటిలో విశేషం యేమిటి?

తిష్య — ఏముంది, పిచ్చి. ఈ చెట్టుక్రింద కూర్చుంటే, బుద్ధుడికి జ్ఞానోదయం కలిగిందట. అయితే యీనకే మెచ్చిందో? శవాన్నికూడా మోసే శక్తిలేదు యీ కట్టెలకు.

శోభ — అవుతే మీరెందుకు దీన్ని నిర్మూలం చెయ్యడం?

తిష్య — ఎందుకేమిటి ? దేశాభివృద్ధికి. దీనివల్ల అంతా పెళ్లాం బిడ్డలను వదలి బైరాగుల్లా దేశమంతా తిరుగుతున్నారు; వాళ్లందరికీ భక్తివుం డేడిందీ? రాజుగా రేది చేస్తే అది చెయ్యాలని వాళ్లతత్వం. జీవహింస పనికిరాదట, వాళ్ల తల కాయ. మాంసం తినకూడదు; కాని ఫలాలను పిండి రసం తాగొచ్చు. గోహత్య తప్పుకాదట. కట్టుకున్న పెండ్లాన్ని వొదిలెయ్యడం, తరవాత అది సరిగా లేకపోతే దాన్ని హింసించడం. చూడు నే వొచ్చినమొదట్లో అశోకుడు నన్ను వొదిలి వుండేవాడా? వొకరోజున యేమన్నాడో తెలుసా? ఉండు కాగితంమీద వ్రాశాను, చదువుతాను ... (చదువుతుంది) "మెరుగుపురుగు తనకాంతితో పురుషపురుగును ఆకర్షించినట్లు నీనేత్రాలవెలుగు చీకట్లో మరుగుపడ్డ నామనస్సును ఆకర్షిస్తున్నాయి" ఇల్లాంటివి యెన్నో! ఏమిటే అల్లా పిచ్చిదాన్లా చూస్తావు! సరే, తరవాత నన్ను పూర్తిగా మరిచిపోయి, ఈవృక్షందగ్గరే కాలం గడుపుతున్నాడు. ఇది పోతే యింకెక్కడికి కెడతాడో చూస్తాగా...

శోభ — (భయపడుతూ) ఐతే, మీకెందుకమ్మా మహేంద్రుడిగారిమీద అంతప్రేమ ?

తిష్య — నాకు కాదు, ఆయనకే మొదట్లో నామీద వుండేది. ఇప్పుడు మళ్లా సన్యాసిగా మారిపొయ్యాడు. ఇతనికళ్లను చూస్తే నాకు కునాలుడు జ్ఞాపకం వొస్తాడు. నేను నిజంగా ప్రేమించింది కునాలుడొక్కడే.

(ఇంతలో వీధిలోనుంచి పాట వినిపిస్తుంది) వోనే, ఆయ నెవరో గుడ్డివాడు పాడుకుంటూ వొస్తున్నాడు; ఇందాకా యిల్లాగే వెళ్లాడు. నాకు యెందుకో కునాలుడు జ్ఞాపకం వొస్తున్నాడు.

(పాట సన్నగిల్లిపోతుంది, ఇద్దరూ నిశ్శబ్దంగా వుండగా, మహేంద్రుడు ప్రవేశిస్తాడు; తిష్యరక్షిత కండువా కప్పుకుంటుంది.)

మహే — తిష్యా! నీ మందిరంలోకి, ఆకస్మికంగా వొచ్చినందుకు నన్ను క్షమించు. తొందర పనిమీద వొచ్చాను. బోధివృక్షాన్ని, యెవరో కొందరు, నాశనం చెయ్యటానికి యత్నించారట. కొన్ని కొమ్మలుకూడా వూడగొట్టారట

తరువాత మంత్రాలవల్ల, దాన్ని నిర్మూలించడానికి యత్నించారట. వాళ్లు కొందరు పట్టుపడ్డారు. రాజు బెదిరించగా, నీప్రోత్సాహం వల్ల చేశామని చెప్పారు. ఇవేనా ఆకొత్తలు? చాలా ఘోరం చేశావు.

తిష్య — (మాట్లాడదు.)

మహే — సమాధానం చెప్పు. నువ్వేనా?

తిష్య — ఐతే యేమిటి?

మహే — రాజు నిన్ను, తీసుకు రమ్మనమన్నాడు.

తిష్య — నే నవుతేకదా, సరే, నే కాదు.

మహే — పరిహాసానికిది సమయం కాదు. ఆలస్యం చేస్తే ఆయనే యిక్కడికి కొస్తాడు. కునాలుడి కండ్లు పీకించింది కూడా నువ్వేటగా?

తిష్య — కొంపతీసి, నీకతనిమీద అసూయలేదుకద.

మహే — ఛ, ఛా, కఠిన వాక్కులు. కాని నేను వీటికి అతీతుడను. ఆపనిచేసింది, నువ్వేఅంటే, నేను ఆశ్చర్యపడను.

తిష్య — నా మనస్సు నీకు తెలియబర్చటంవల్ల నువ్వు లోకువ తీసుకుని, అనవసరంగా మాట్లాడుతున్నావు. అశోకుడు వుపద్రవమైన అస్వస్థత లో వున్నప్పుడు, ఆ జబ్బు కుదిర్చింది నేనని, నీకు జ్ఞాపకం వుందా? మీరాజును, మృత్యువు పాలినుండి తప్పించింది నేనని తెలుసా?

మహే — తండ్రి కొడుకులలో, యెవరిని ప్రేమించావో తెలియడంలేదు.

తిష్య — కాని, నీలాంటిశిలను ప్రేమించలేదు. నా వ్యక్తిత్వాన్ని యెవరైతే గౌరవించారని నువ్వు నమ్మతావో, వారినే ప్రేమించానని, నువ్వు నమ్మ.

మహే — నీ వాంఛకు లోబడనందువల్ల, కునాలుని తరిమివేసి, కండ్లు పీకించావన్నమాట. అశోకుడు, నీకు మరణదండన విధిస్తే.

తిష్య — అందరితోపాటు, నేను శిలగా మారతాను.

మహే — నిన్ను లోకం దూషిస్తుంది.

తిష్య — హృదయంలేనిలోకం దూషించాలనే నా అభిలాష. నన్ను చంపడం జీవహింస కాదు? అది మీమతానికి విరుద్ధంకాదా? ఓపికవున్నంత సేపు స్త్రీలను ఆడించి, అది నశించింతర్వాత. మతంపేరు చెప్పి మమ్మలను హింసించే యీ మీ మతానికి, 'నపుంసకమతం' అని పేరు పెట్టాలి.

మహే — నే వినలేను. నీకు మృత్యువు తప్పదు, రాజుకు సత్యం విన్నవించి క్షమించమని ప్రార్థిస్తాను.

తిష్య — ఏమిటా సత్యం?

మహే — నువిల్లా చేశావని.

తిష్య — అందులో నువ్వుచేసిన సంగతులుకూడా ఉన్నాయా?

మహే — అవి అసందర్భం. నే వెడతా.

తిష్య — సందర్భం చూపిస్తా (అని మూలనున్న బాణం తీసి, వెనక్కు తిరిగి నడిచిపోతున్న మహేంద్రుడి వెన్నుమీద గురిచూసి విసరుతుంది అంబును; మహేంద్రుడు, 'అమ్మా!' అని పడిపోతాడు. శోభనామిత్ర, యితరులు అతన్ని లోనికి తీసుకెడతారు.)

## రెండవ రంగము

(అశోకుని 'విజ్ఞానసాధనా' మందిరం. మహేంద్రుడు, గోడను ఆనుకుని కూర్చునివుంటాడు. సంఘమిత్ర గుమ్మంమీద నిలబడి వుంటుంది. అశోకుడు పీఠంముందు పచార్లు చేస్తూవుంటాడు. ఇద్దరు బ్రాహ్మలు, ముగ్గురు చైనాదేశీయులు, కుర్చీలమీద కూర్చునివుంటారు. ఆరడుగుల యెత్తైన స్తంభంమీద అమర్చబడ్డ బుద్ధ విగ్రహం ప్రక్కన నిలబడి వుంటుంది, తిష్యరక్షిత. అంతా ఆమెకేసీ, అశోకుడికేసీ చూస్తూవుంటారు.)

అశో — కునాలుడు నీ కేమౌతాడు?

(నిశ్శబ్దం)

అశో — నిన్నే.

(తిష్యరక్షిత బ్రాహ్మలకేసి చూస్తుంది. శోభనామిత్ర వొచ్చేనవ్వును ఆపుకుంటుంది.)

తిష్య — నాభర్తకు మొదటిభార్యకొడుకు.

అశో — ఒకమాటలో చెప్పాలి.

తిష్య — సంఘ, సంసార కట్టుబాట్ల ననుసరించి "పుత్రుడు"

అశో — అంతేకాని నిన్నుబట్టి, పుత్రుడు కాడన్న మాట.

తిష్య — ఊరికే, మర్యాదకోసం, 'పుత్రుడు' అనవచ్చు, అందర్లాగు. కానది సత్యం కాదు.

అశో — నువ్వు, ఆ'పుత్రుని' ప్రేమించవచ్చా?

తిష్య — ఎవరు చెప్పారు?

అశో — నువ్వు సత్యాన్ని ఆరాధించేదానివి గనక, నిజం పలకాలి. ఎవరు చెప్పిందీ నీ కనవసరం· నువ్వు చెప్పిందే సత్యం.

తిష్య — అల్లాగైతే, ప్రేమించకూడదు.

అశో — మరి నువ్వెందుకు, అతన్ని ప్రేమించావు? సత్యం పల్కాలి.

తిష్య — వాంఛించిన వోస్తువును నిరాకరిస్తే, నా మనసు దుఃఖిస్తుంది. అల్లా మనస్సును హింసించటం నా మతం కాదు.

అశో — మరి. రాజును, యెందుకు వివాహమాడావు?

తిష్య — నేను రాజును వివాహమాడలేద; రాజే నన్ను వివాహమాడారు.

(జైనాయువకులు గుసగుసలు మొదలెడతారు)

అశో — అది రాజును మోసగించటంకాదు?

తిష్య — రాజుకు ప్రత్యేకమైన—వ్యక్తికి సంబంధించిన—హృదయాలు భార్యలకు ఇచ్చేటందుకు వుండవనీ, రాజుకు ప్రత్యేకత లేదనీ, మహేంద్రుడు, రాజనీతి శెలవిచ్చాడు. అందుచేత, రాజుకు మోసపోయేందుకు, అందులో స్త్రీ వల్ల—హృదయం లేదు.

అశో — నువ్వు రాణీవని తెలుసా?

తిష్య — మీరు నన్ను గౌరవించిన రోజుల్లో రాణీని; తరవాత, స్త్రీని. రాజులలాగే, రాణీలుకూడా, ప్రేమించారు; ప్రేమించేది స్త్రీలే.

అశో — కుటుంబనీతికి భంగం కాదు?

తిష్య — కుటుంబం, నీతి,—యీ రెండు, రాణీలకు తెలుసు.

అశో — నీకు తెలిసినా, తెలియకపోయినా, కళంకితజీవితం నీకు తప్పదు.

తిష్య — జీవించివున్న వ్యక్తులకు గౌరవం లేనప్పుడు, చచ్చింతర్వాత, కళంకం విచారించనక్కర లేదు.

అశో — అవినీతికరమైన దౌర్జన్యానికి, నీకు దండన మృత్యువు.

తిష్య — మహాప్రసాదం. మతంవల్ల కాకపోయినా, మీ ఆదర్శనీయభావాలవల్ల మీకీర్తి శాశ్వతంగా వుంటుంది.

(తిష్యరక్షిత వెళ్లిపోబోతుంది)

అశో — ఆగు. (వొక బ్రాహ్మణుని పిల్చి సంజ్ఞ చేస్తాడు)

బ్రా — బోధివృక్షం, పాడుచెయ్యాలని తలపెట్టడంలో వుద్దేశం?

తిష్య — మతం అన్నదాన్ని నిర్మూలం చెయ్యాలని. మతానికే వృక్షం, వొక బహిర్గత నిదర్శనం.

బ్రా — మతం నీకు చేసిన అన్యాయం?

తిష్య — మతం, వ్యక్తులకు ప్రత్యేకంగా అన్యాయం చెయ్యదు, సంఘానికి చేస్తుంది; కానిసంఘానికి నోరు లేదు, దేశానికి చేస్తుంది.

బ్రాహ్మ— ఏవిధంగా?

తిష్య — అశోకుడికి తెలుసు; వొకప్పుడైనా హృదయం, తార్కికజ్ఞానం వున్న ప్రతివ్యక్తికీ తెలుసు. మీ మతంలో, యితర మతాలు అనేకం వుంటాయి, వాటినికూడా గుర్తించాలి అన్న నియమం తప్ప యితర మంచి కనిపించలేదు. మతం లేకపోవడం; నామతం, దాన్ని గుర్తించి, నన్నీ కుచ్ఛితపుప్రశ్నలు వెయ్యడం మానండి. ఆంతరంగికవిషయాలను, ప్రశ్నించేటందుకు, అశోకుడికిమాత్రం హక్కు వున్నది. వాటిని నేను ఏకాంతంలో ముచ్చటిస్తాను.

అశో — రాజుకు, దేశన్యాయం తప్ప, ఏకాంతం లేదు. ఇక్కడే చెప్పాలి.

తిష్య — సరే.అశోకుడు, ప్రథమభార్య చనిపోయిన నాలుగుసంవత్సరాలకే వాంఛ చెలరేగి నన్ను పరిణయమాడాడు. నన్ను పూర్తిగా అనుభవించాడు. ఆయన చిన్నతనంలో కళింగదేశాన్ని జయించినప్పుడు, శక్తివల్ల, దౌర్జన్యంవల్ల, యుద్ధంవల్ల రాజ్యం నిలబెట్టుకోలేనని గ్రహించుకున్నాడు. అందుకని, బౌద్ధమతం అవలంబించి 'జీవహింస కూడదు' అన్నమిష మీద శాంతి నెలకొల్పుకొన్నాడు. ఈ మతానికి, పునాది రాజ్య విస్తీర్ణతే.

(సంఘమిత్ర చెవులు మూసుకుంటుంది)

ఈ మతంపేరు చెప్పి, రాజ్యం స్థిరపడింది; కీర్తి దక్కింది. ఇదొక నాటకం. రెండోది, ఓపిక నశించిన తర్వాత మళ్లీ మతంపేరు చెప్పి, వాంఛను దూషిస్తూ, భార్యలను ఖైదీలగా చేసి నిరాకరిస్తూ, మానసికంగా హింసించాడు. శరీరాన్ని నశింపచెయ్యాలని సంకల్పం; ఎందుకంటే శరీరం కృశించింది కనక; దానికి నా యిప్పటిబ్రతుకే నిదర్శనం. ఈమతం, లోగడ వుద్భవించే అభిప్రాయభేదాలను, మానవశక్తికి సంబంధించిన చిన్నిబలహీనతలనూ కప్పిపుచ్చేటందుకు యేర్పర్చబడిన వొక పెద్దభూతం. ఇది వున్నంతవరకూ మానవులకు సంతోషం ముక్తి వుండవు. ఇల్లాంటివి చాల మతాలొస్తాయి. చివరకు దేశవినాశం తప్పదు.

అశో — చాలు ప్రేలాపన.

తిష్య — సత్యం వెల్లడికావలసిందే; కాని తప్పదు; సత్యం తెలుసుకోడం, కష్టంతో కూడి వుంది. నేను కునాలుని ప్రేమించింది వాస్తవమే. అశోకునిలో ఆతని ఆకృతి కనిపించింది గనకనే కొంతకాలమైనా, ఆయన్ని ఆరాధించకలిగాను. అతనిక్కడ వుండగా, అతన్ని తాకకుండా వుండలేకపొయ్యేదాన్ని. అందుకనే అతన్ని పరరాజ్యంలోకి పంపించాను. కాని అతనికళ్లు తీయించింది నేనుకాదు. అతను అంధుడైతే నాకీలోకం చీకటి. ఈ జీవితంలో శిలావిగ్రహాలమధ్య బ్రతకలేను. మీమతాలు శాశ్వతంగా వుండి, దేశాన్ని శ్మశానవాటికగా మారుస్తాయి. నామతం నాతోనే అంతరించాలి.

(ప్రక్కనున్న స్తంభాన్ని తన్నగా, పెద్దశాల విగ్రహం కిందపడుతుంది. దానికింద తిష్యరక్షిత పడి మరణిస్తుంది.) [3]

---

3. తిష్యరక్షిత, యేవిధంగా మరణించిందో, చరిత్రకారులు రూఢిగా చెప్పరు. ఈ నాటికలోవిధంగా చావడం, నాకల్పితం. కాని, చరిత్రకారులందరూ, యీ క్రింది విషయాలను గురించి అంగీకరించారు.

క. తిష్యరక్షితను, అశోకుడు, వృద్ధాప్యంలో వివాహమాడాడు.

చ. ఆమె చాలా సౌందర్యవతి; ప్రవర్తన చాలా చెడ్డదైనా, గొప్ప తార్కికజ్ఞానం కలది.

ట. అశోకుడికి తటస్థించిన, పెద్దజాడ్యాన్ని, వుల్లిపాయలమందు చేసి కుదిర్చింది.

త. బోధివృక్షాన్ని నిర్మూలం చెయ్యడానికి ప్రయత్నం సల్పింది.

(అంతా దగ్గరగా వొస్తారు. కొంత అలజడి బైలుదేరుతుంది)

అశో — ఇది ద్వేషించింది, నామతాన్నా' నన్నా?

చైనా యువకుడు—అసలు మతాన్నే ప్రభూ! ౪

---

మిగతా వన్నీ పిట్టకథలని నాభయం. ఒకదానిప్రకారం, తిష్యరక్షిత, కునాలుని (అశోకునిపుత్రుడు) ప్రేమించిందనీ, అతడు యిష్టపడకపోవడంవల్ల రాజ్యంల్లోంచి వెళ్లగొట్టి, కళ్లు పీకించిందనీ వుంది. తరువాత, కునాలుడు అశోకుని కలుసుకుంటాడు. అశోకుడు, భార్యకు మరణదండన విధిస్తాడు.

ఒక యోగివల్ల కునాలుడికి, నేత్రా లొస్తాయి. ఇదంతా సారంగధరుని చరిత్రను జ్ఞప్తికి తెస్తుంది. చివరిభాగం పురాణగాథకు సంబంధించింది కాబట్టి, నమ్మతగింది కాదు. చిత్రాంగి కాపాడింపబడ్డ కళ్ళు కాన్ని పోగొట్టటానికి చేయబడ్డ యత్నాలను మనమెరుగుదుం. ఇందులో, కునాలుని వెళ్లగొట్టడంవరకూ మాత్రం, నమ్మతగిందిగా వుంది.

౪. అశోకు డనేకస్తూపాలను, నిర్మించాడన్నది అందరికీ తెలిసిందే. కాని, బేస్‌నగరంలో వొక ౬ అడుగుల, ౨ అంగుళాల యెత్తుగల, స్త్రీ శిలావిగ్రహం, బైటపడింది, యిటీవల. ఇల్లాంటిది, యిది వొక్కటే, అశోకుని కాలంలోది. నా నమ్మకం, యిది, తిష్యరక్షితదే ఐ వుంటుం దని.

---


# హంసత్రయము



**బాలహంస:**—అను శిశురక్ష, బాలురకు అగు పడు సమస్తరోగములకును, అజీర్ణము, వాంతులు, కడుపుఉబ్బు, విరేచనబద్ధము, గురకదగ్గు, అనాసలు మొదలగుజబ్బులను తొలగించి, ఆయుర్వృద్ధి కలిగించును.

50 మోతాదులు గల సీసా రు 1-0-0

**హంస:**— స్త్రీలపాలిటి అరచేతి మాణిక్యము. ఋతుసంబంధమయిన చతుర్విధరోగములు, బహిష్టు కాకుండుట, ఋతుశూలలు, తెల్లకుసుమ, యెఱ్ఱకుసుమ, ఋతుక్రమము తప్పుట, సర్వ వంధ్యాదోషములు, అపస్మారము, మొదలగు సమస్తవ్యాధులను తొలగించును.

1 పౌను బుడ్డి 40 రోజులకు రు 4-0-0

$\frac{1}{2}$ పౌను బుడ్డి 20 రోజులకు రు 2-4-0

**పరమహంస రసాయనము:**— స్త్రీ పురుషాదులకు ఆయుర్వృద్ధి, జ్ఞానవృద్ధి, వీర్యవృద్ధి, సంతానవృద్ధి, తేజోవృద్ధి, కలుగజేయు రసాయనము. వింశతి మేహములు, క్షయ, శ్వాసకాసలు అశీతవాతములు, పక్షవాతము, సర్వశూలలను నిర్మూలించి ధాతుపుష్టిని కలుగజేయును.

80 మాత్రలుగల సీసా 40 రోజులకు రు 4-0-0

40 మాత్రలుగల సీసా 20 రోజులకు రు 2-4-0

పోస్టేజీ ఖర్చులుగాక,

ఇతర ఔషధములను, కేటలాగులను వలయువారు యీ క్రింద చిరునామాకు వ్రాయవలయును.

రావుసాహేబు,

మండపాక అప్పలనరసయ్య

అశిస్టాంటు యింజినీయరు పి. డబ్ల్యు. డి. రిటైర్డు,

శ్రీ రామయోగి ఆశ్రమ. వాల్తేరు. R. S.